ప్రమోషన్

సెట్టిల శ్రీరామమూర్తి

"బ్రహ్మయ్యగారింట్లో వున్నారాండి" గేటు కటకటాల్లోంచి ప్రశ్న.

ఓసారి అటుకేసి బుర్రవిసిరి మళ్లీ సావిట్లోకి వెళ్లిపోయాడు వెంకన్న, లోపలేదో పెద్ద పనున్నట్టు. వెంకన్న ఆలోచిస్తున్నాడు "ఈయన్ని ఎంతసేపు ఆలస్యం చేయిద్దాం?" నడుస్తూ అంచనా వేసుకుంటున్నాడు. "ఏమాత్రం కిట్టుంది?"

సావిట్లోంచి గదిలోకి, మళ్లీ వసారాలోకి తిరిగి సావిట్లోకి ఏదో పని కల్పించుకు తచ్చాడుతూ వీధిలో నించున్న ఆయనకేసి మళ్లీ చూపు విసిరి గదిలోకి చెక్కబోయాడు. ఆయన కొంచం ధైర్యం చేసి, చెయ్యి వూపి నిష్ప్రయోజనంగా నీరసంగా క్రిందికి చెయ్యి జారవిడిచాడు. ఆయన బుంగమీసాలూ, జరీ ఖద్దరు కండువా, పంచ, లాల్చీ వాటం అంతా కనిపెట్టున్నాడు వెంకన్న. ఇంకా ఆలస్యం చేస్తే అసలు బెడిసికొట్టుందేమో అని ఓ నిర్ధారణకు వచ్చి, ఆఫీసుగదిలోని వెండిగ్లాసు పెరట్లోకి తీసుకుపోయి తీరుబడిగా నెమ్మదిగా గేటుకేసి వచ్చాడు హైడ్రోజన్‌బాంబు మీదపడ్డా దులిపేసుకునే నిర్లిప్తతో. గేటు తీస్తూ అప్పుడే ఆయన్ని అకస్మాత్తుగా చూసినట్లు ఆశ్చర్యంగా మొహం పెట్టి—

"ఎవరు బాబూ? ఏంటి కావాలి తమకి?" అన్నాడు.

"ఆఫీసరుగారు లోపల వున్నారా?" అన్నాడాయన.

"ఏం? ఎందుకు? ఏంగావాలి మీకు ఆయనతో" అన్నాడు చిరాగ్గా వెంకన్న కనుబొమలు ముడిచి.

"కొంచం పనుంది...ఓసారి దర్శనం చేసుకుందికి వీలుంటుందేమో అని" సందేహిస్తూ అన్నాడు ఆయన.

"ఇప్పుడేం లాభంలేదు. అయ్యగారు 'బిజీ'గా వున్నారు. ఇప్పుడు ఎవ్వరూ చూడ్డానికి వీల్లేదు."

"అది కాదోయ్, ఇల్లా చూడు" తళతళ మెరుస్తూన్న ఓ వెండిరూపాయి చేతులు మారింది. ఆ అరక్షణంలో అంతవరకూ కోపంగా చిరాగ్గావున్న వెంకన్న మొహం వికసించింది. ఆనందంతో కూడిన చిరునవ్వుతో కళ్లు పెద్దవిచేసుకుని

"మీరా బాబూ, ఒక్క నిమిషం వుండండి లోపల చెప్పివస్తాను" అంటూ ఎంతో ఆప్యాయంతో ఏ పాతికేళ్లనించో ప్రాణస్నేహం కలిగినవాడిలా, ఆప్తబంధువులా, ఆయన్ని పలకరించి ప్రసన్నవదనంతో ఇంట్లోకి వెళ్లేడు. మళ్ళీ క్షణంలో వెంకన్న నవ్వుమొహం సావిట్లోంచి ఆయన్ని పిలిచింది. ఆయన బుంగమీసాలు సవరించుకుంటూ ఖామోదాతో ఆఫీసరుగారిగదిలోకి ప్రవేశించేరు.

ఆఫీసరుగారు బుర్ర వంచుకుని ఏదిటో వూరికే రాసేస్తున్నారు, వెంకన్న వచ్చి ఎవరో వచ్చారని చెప్పినప్పట్నించీ ఆయన గది గుమ్మం లోపలగానిల్చుని చిన్నపాడిదగ్గదగ్గి, గొంతుక సవరించుకుని, కండువా మెడమీంచి జాయిగా సర్దుకున్నాడు. ఆఫీసరుగారు తలెత్తి చూశేరు.

"మాది...వూరండి...హిహిహీ... తమ దర్శనం చేసుకుందామని..."

"ఏంపని?"

ఆఫీసరు సింహంలా చూస్తున్నాడు. ఆయన ఆఫీసరు నైతికబలాబలాలు అంచనా వేసుకుంటున్నాడు. 'అంతా మేకపోతు గాంభీర్యమా, నిజంగా స్ట్రిక్టుమనిషా' అని. తొంగిమాసి మాయమైన వెంకన్న మొహం ఆయన దిగజారినధైర్యాన్ని ఎగసందోసింది.

"బ్రహ్మయ్యగారు చెప్పారు మీసంగతి. ప్రభువుల దర్శనం చేసుకుందామని వచ్చాను. మావాణ్ణి కాపాడమని"

బ్రహ్మయ్యగారిపేరు వినగానే ఆఫీసరుగారి మొహంలో సీరియస్‌నెస్ తగ్గింది. ముఖకవళికలు మామూలుస్థాయికి వచ్చేయి. ఇంతలో 'ఆయన' సంజ్ఞ చేయగానే ఓబుట్ట గదిలో వాలింది.

"మామిడిపళ్లులెండి. మావూరిపళ్లు చాలా ప్రశస్తమైనవి. ఈచుట్టుప్రక్కలకి ఇల్లాంటి పళ్లులేవు. ఈజాతి మా వక్కతోటలోనే వుంది"

ఆఫీసరుగారి మొహంమీద చిరునవ్వు అంకురించింది.

"ఎందుకండీ ఇవన్నీ"అన్నవారిమాటల్లో అంగీకారం సూచించే మెత్తదనం వుంది.

వెంకన్న బుట్టలోపలకి తీసుకుపోయాడు. వెంకన్నని వద్దనబోయినట్లూ, వాడు ఏమీ వినిపించుకోకుండా బుట్టతీసుకుపోతూన్నట్లూ, వాడు ఆపినా ఆగేరకం కాదనీ, వాణ్ణి మంచిలోకి మార్చటం బ్రహ్మతరం కాదనీ అర్థం తోపించేలాగ అదోలా మొహం పెట్టేరు ఆఫీసరుగారు.

"మా విశ్వనాథం చాలా తెలివైనవాడండి. అన్ని పనులూ అతి చురుగ్గా చాకచక్యంతో చేస్తాడు. గుమాస్తాల్లో అంత సమర్థుడు లేడని తమకే తెలిసేవుంటుంది. మరి వెళ్లొస్తాను. సెలవు" ఆయన వెళ్ళిపోయాడు.

ఇంకో గంటకి ఆఫీసరుగారింటిముందు ఓ ఫియట్ ఓల్డుమోడలు కారు ఆగింది. వెంకన్న పరుగెత్తుకుంటూ గేటుదాకా వెళ్ళి, పరుగెత్తుకుంటూ లోపలికి వచ్చి ఆఫీసరుతో హడావిడిగా చెప్పేడు బ్రహ్మయ్యగారు వచ్చారని.

ఆఫీసరు ఉల్లిపడి లేచేడు. బనీనువంటిపై టర్కీటవల్ కప్పుకుని, లుంగీ ముడి బిగించుకుంటూ వెంటనే గేటువరకూ వెళ్ళి ఆయన్ని ఇంట్లోకి ఆహ్వానించేడు.

బ్రహ్మయ్యగారిలాంటి రాజకీయ నాయకుణ్ణి మంచిచేసుకోకపోతే శంకవగిరి మాన్యాలకి ట్రాన్స్‌ఫరు తప్పదని ఆఫీసరుకీ తెల్సు!

"ఏవిటి తమరిలా దయచేసేరు?" అంతటి గెజిటెడు ఆఫీసరూ తనో పురుగు ననుకున్నాడు ఆయన ముందు.

"అబ్బే, మావూరి అక్కయ్య మాటమీద వచ్చేను. వాళ్ళ విశ్వనాథం చాలా చురుకైనవాడూ తెలివైన వాడూనూ. నెక్స్ట ప్రమోషనుకు అతను అన్నివిధాలా తగినవాడనుకుంటాను" బ్రహ్మయ్యగారి వాక్యం తీరులో ఆ విషయంలో తన కేమీ సందేహం లేదనే దృఢనిశ్చయము నిబిడీకృతమైవుంది. సంభాషణ జరిగేటంతసేపూ ఆయన పాముతల చేతికర్రని నెమ్మదిగా నేలమీద కొట్టూ నేవున్నారు వూతపదంగా. ఆ శబ్దంలోని అంతరార్థం ఆ ఆఫీసరుకీ తెలుసు, గది వెనక వసారాలో మామిడిపళ్లు వాసన చూస్తూన్న వెంకన్నకీ తెలుసు.

"అతనికపైన అయిదారుగురు వున్నారంటే—సీనియారిటీ..."

"ఆఁ సమర్థత ముందు సీనియారిటీ ఎంత?" చేతికర్ర పూపుగా ఆఖరిసారి గట్టిగా నేలమీకొట్టి కుర్చీలోంచి లేచేరు బ్రహ్మయ్యగారు.

కొంగు బుర్రుమంది. చేతికర్రచప్పుడు ఆఫీసరు మెదడులో మెదులుతూనే వుంది.

రాత్రి తానాలో పదీ కొట్టూండగా ఆయన మళ్ళీ గేటుముంగు తయారయ్యాడు. వెంకన్న అలికిడి పసికట్టి చిగునవ్వుతో ఆయన్ని లోపలకి తీసుకువచ్చేడు. ఆఫీసరుగారు "దయచేయండి" అని కుర్చీ చూపించేరు.

"ఇప్పుడే బ్రహ్మయ్యగారువచ్చివెళ్ళేరు"

"ఆఁ అలాగా అండి, ఎంతసేపైంది?" అన్నాడాయన, తనేమీ ఎరగనట్లూ, అప్పుడే తనీ ప్రపంచంలో అడుగు పెట్టినట్లూ మొహం పెట్టి.

"మీ విశ్వనాథంసంగతి చెప్పేరు. చూస్తాను"

"చూస్తాననటం కాదు ప్రభువులు తల్చుకుంటే కానిదేముంది" ఒక బరువు కవరు బల్లమీదికి ప్రాకింది.

"ఏఁవిటండీ ఇదంతా" అన్నాడు ఆఫీసరు నీరసంగా. ఒకరి నైతికవిలువలు ఒకరు లెక్క వేసుకుంటూన్నట్లు ఒకరిమొహంలోకి ఒకరు క్షణకాలం చూసుకున్నారు.

ఆయన బుంగమీసాలు సవరించుకుంటూ "అబ్బే ఏముందండీ మీమీద మాకున్న ప్రేమనీ భక్తినీ, గౌరవాన్నీ ఇదో స్వల్ప రూపాన్ని చూపించుకుంటున్నాం ప్రభువులు కటాక్షించాలి మరి"

బ్రహ్మయ్యగారి చేతికర్రచప్పుడు ఇంకా వింటూనేవున్న ఆఫీసరుగారు చడీచప్పుడూ లేకుండా "అది" డ్రాయర్లోకి దిగజార్చి ఎంతో చిరాకుమొహం పెట్టి చుట్టుప్రక్కలు కలయజూసేరు.

"విశ్వనాథమా, చురుకైనవాడు కదూ, అట్టే ఇబ్బంది వుండదులెండి. శాయశక్తులా ప్రయత్నిస్తాను" ఆఫీసరు లేచేరు.

"సెలవిప్పించండి" దణ్ణం పెట్టి ఆయన వెళ్ళిపోయాడు.

మరి కొన్నాళ్ళకి. విశ్వనాథం హుషారుగా ఆవేళ ఆఫీసుకివస్తున్నాడు. అతని సంతోషానికి అంతులేదు. పెళ్ళినాటితర్వాత తనకి మళ్ళీ అంతసంతోషము కలిగింది ఆ రోజునే. అక్కయ్యమామ చెప్పేడు ఆర్డర్సు ప్యాసు అయ్యాయనీ, ఆరోజు వస్తాయనీ. తను గెజిటెడు ఆఫీసరు అయిపోతున్నాడు. అక్కయ్యమామ మీసాలపైని అపరిమితమైన అభిమానం పుట్టుకొచ్చింది ఇహమీద ముందు డవాలాబంట్రోతూ వెనకాలతనూ...ఇంక తన పెళ్ళానికి కావల్సిన నగలు చేయించవచ్చు...ఇదివరకులా ఆబగా రోడ్డుమీదంచే షో కేసులుకేసి చూడనవసరంలేదు. దర్జాగా లోపలకే వెళ్ళి కొనుక్కోవచ్చు. పిల్లల్ని కారులో కాన్వెంటుకు పంపించాలి ఇప్పుడు కాలు మీద కాలు వేసుకుని సుఖంగా కావల్సినవన్నీ తింటూ (అయ్యరు హోటల్లో రెండు ఇడ్లీ సాంబారుతోనే సరిపుచ్చుకో నక్కర్లేదు), చూస్తూ, కోరికలన్నీ తీర్చుకోవచ్చు. తన స్వంతకారులో – అక్కయ్యమామ ఫియట్ ఓల్డుమోడల్ తల్చుకుని నవ్వుకున్నాడు – భార్యాపిల్లల్తో బీచికి సినీమాలకి తిరగొచ్చు...అమ్మయ్య ఎన్నాళ్ళకి ఈ 'బల్లదగ్గిర బానిసత్వం' నించి విముక్తి! చేతిలోని కాయితాల పాడ్ కేసి చూస్తూ సానుభూతిగా ఓ నీరసపు చిరునవ్వు నవ్వేడు. రోజూ తను విధిగా నడిచే ఈ రోడ్డూ, ఈ చెట్లూ, గరల్స్కూలు గోడా, ప్రక్క మైదానంలో ఫుట్బాల్ ఆడే పిల్లలూ – అంతటితో ఋణం తీరిపోతుంది బెంగగా చూసేడు చుట్టూ పాపం తన స్నేహితులంతా అల్లా గుమాస్తాలుగానే వుండిపోతారు. ఎంత తెలివైనవాడైతేనేం అందరికీ అక్కయ్యమామ లుంటారా? తనకి ఆర్డరు రాగానే మిత్రులందరూ అభినందిస్తారు. ఇంక కంగ్రాట్యులేషన్సూ, షేక్ హేండ్లూ, టీ పార్టీలూ ఓ ఒహ ఏమిటి తనకి ఆఫీసుపన్లు చేతకాకపోయినా, తనని మిత్రులు ఏం వేళాకోళం చేసినా, ఇప్పుడుమట్టుకి తన సుగుణాల్ని వర్ణించి తనని గొప్పగా చెప్పుకుంటారు. తనకి పూలదండలు వేసి పార్టీలిస్తే తాను వినయం నటిస్తూ 'ఇది అంతా మీ అభిమానమే కాని నా ప్రయోజకత్వం ఏమీ లేదనీ, మీ పొగడ్తలకు తగినవాడిని కాననీ' అంటూ ఓ చిన్న ఉపన్యాసం దంచేస్తాడు. తనతోటి గుమాస్తాలే తన చేతికిందికి వస్తే? కె. విశ్వనాథంలాంటి వాడు వస్తే బాగుండును. పనంతా వాడే చేసుకుపోతాడు. తనకి సంతకాల శ్రమ తప్ప ఇంకేమీ వుండదు...ఈపాటికి ఆఫీసులో తెల్సేవుంటుంది కావాలనే తను ఆలస్యంగా వస్తున్నాడు తన కేమీ తెలియనట్టుండాలని.

ఆఫీసులోకి వచ్చేడు విశ్వనాథం.

"విశ్వనాథం!" అన్న కేక విని, అప్పుడే అందరికీ తెలిసిందీనా అన్నట్లు వెనక్కి తిరిగి చూసేడు. కేశవయ్య కేకేస్తున్నది తన్నికాదు కె. విశ్వనాథాన్ని! తనూ అటు కేసి చూసేడు. విస్సిగాడి చుట్టూ మిత్రులంతా చేరి సంతోషంగా ఏవేవో అంటున్నారు. కంగ్రాచ్యులేషన్సూ, షేక్ హేండ్లూ ఎడతెరపి లేకుండా జరిగిపోతున్నాయి.

"నువ్వు అదృష్టవంతుడివోయ్ విశ్వం. నీ తెలివి తేటలకీ, చురుకుతనానికీ తగినట్లుగానే వచ్చింది ఈ ప్రమోషను. నువ్వు గెజిటెడు ఆఫీసరు వయ్యావంటే మాకు చాలా గర్వకారణం" అన్నాడు రంగయ్య.

"అసలు విశ్వనాథం మొదటినించీ ముక్కుసూటిగా నడిచే మనిషి. ఇంట్లో ఎంత బాధపడుతున్నా ఎర్రని ఏగాణీ పైన తెమ్ము కోసం ఎరగడు. వాడి నిజాయితీయే వాణ్ణి రక్షించింది" అన్నాడు కేశవయ్య.

"ఏంకోయ్ ఏవేనా ట్రయల్సు చేసేవేమిట్రా? అంతిమంది పైనుండగా నీ కెల్లా వచ్చిందిరా?" అన్నాడు ఛలోక్తిగా వెంకట్రావు.

"వాడి సంగతి తెలిసీ అల్లా అంటావేమిరా? అడిగించుకోకుండా సిరి వాణ్ణి వరించి వచ్చింది అంతే...ఇదిగో ఐ. విశ్వనాథం వచ్చేడే. ఎంతసేపైందిరా, వచ్చి?.. నీకు తెలిసిందిరా, భాయ్ మన విశ్వనాథం ఆఫీసరు అయ్యాడురా" అన్నాడు శంకరయ్య.

"ఆఁ" అని మాత్రమే అనగల్గిన విశ్వనాథం తెరచిన నోరుతో గ్రుక్కు మిటకరించి, మొహాన్ని నెత్తురుచుక్క లేకుండా కొయ్యయిపోయి అల్లా చూస్తూ నిల్చుండిపోయాడు.

తర్వాత, అక్కయ్య మామమీసాలు పూడలాగి ఓల్డుమోడలు ఫియట్ కారుఇంజన్లో వేసి పుటకగొట్టాలనే విశ్వనాథం తీవ్రప్రయత్నాలూ, అక్కయ్యమామ నాలిక కరచుకున్నా తెగని నాలికా, మన్యానికి ట్రాన్సఫరైన ఆఫీసరు అర్థంకాని మొహమూ, బయటికి పొక్కని గ్రంథస్థముకాని ప్రపంచచరిత్రలోని పరమ రహస్యాల్లో వుండిపోయాయి ★



డిస్ట్రిబ్యూటర్లు :
మెస్సర్సు: వి. సి. రామలింగం & సన్సు
2/422, టంకసాలవీధి, మద్రాసు.